E69 NEWS


# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387


PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :136 శుక్రవారం 16 అక్టోబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

# బీఎస్-7పై కేంద్రం బిగ్ అప్‌డేట్!




2 లో

- 2029 ఏప్రిల్ నుంచి కొత్త నిబంధనలు
- మూడు దశల్లో బీఎస్-7 అమలు
- వాహన కాలుష్య నియంత్రణే ప్రధాన లక్ష్యం
- హానికర ఉద్గారాల తగ్గింపునకు చర్యలు
- ప్రస్తుత వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు
- బీఎస్-6 వాహనాలపై ప్రభావం ఉండదన్న స్పష్టత

# మహిళా శక్తితో స్వర్ణాంధ్ర లక్ష్యం!

- 'స్వయం ఏపీ'తో మహిళలకు కొత్త భరోసా
- 10 లక్షల మంది మహిళలే లక్ష్యం
- డ్వాక్రా ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్
- 11 లక్షల సంఘాలు.. రూ.69 వేల కోట్ల టర్నోవర్
- ఏడాదిలో లక్ష మంది మహిళలు వ్యాపారవేత్తలుగా
- 5 లక్షల మంది పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే యత్నం
- పొదుపు నుంచి ఆదాయార్జన వైపు అడుగులు
- మహిళా శక్తితో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం



2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** మహిళా సాధికారత, గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ 'సరస్ మేళా' 2026 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ బ్రాండ్ ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికలపై అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీఎం చెప్పారు. జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు సభలో మాట్లాడారు.

'ఢిల్లీలో నిర్వహించే జాతీయ మహిళా సరస్ మేళాను తొలిసారిగా ఢిల్లీ వెలుపల విజయవాడలో నిర్వహించడం ఓ ప్రత్యేకత. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నారీశక్తికి, నవభారత శక్తికి ప్రతిరూపం. గ్రామీణ మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు విస్తృత గుర్తింపు తీసుకురావడమే సరస్ మేళా ప్రధాన ఉద్దేశం.

# నక్సలిజం గాయం

## 1,570 మంది బాధితులు!

- బస్తర్ వేదనకు ఆ సంఖ్యే నిదర్శనం
- నక్సలిజంతో గిరిజనులకు తీరని నష్టం
- బాధితులకు కృత్రిమ అవయవాల పంపిణీ
- జగదల్‌పూర్ శిబిరంలో 3,600 మందికి లబ్ధి
- బస్తర్‌లోనే 1,570 మందికి పైగా సాయం
- ఐదు దశాబ్దాలుగా నక్సలిజం ప్రభావం
- గిరిజనుల కష్టాలను చాటుతున్న గణాంకాలు
- 'సేవ సంకల్ప్ అభియాన్'తో బాధితులకు ఊరట

2 లో

# పాల ఉత్పత్తుల్లో కల్తీ గుట్టురట్టు!

- హైదరాబాద్‌లో అక్రమ డైరీ దందా గుట్టురట్టు
- ఆరు డైరీ యూనిట్లపై అధికారుల దాడులు
- అపరిశుభ్ర వాతావరణంలో పాల ఉత్పత్తులు
- లైసెన్సులు లేకుండానే యూనిట్ల నిర్వహణ
- బస్సులు, డీసీఎంలలో అక్రమ రవాణా
- 3.6 టన్నుల కల్తీ కోవా స్వాధీనం
- నిబంధనలు ఉల్లంఘించిన యూనిట్లు సీజ్
- పలువురికి షోకాజ్ నోటీసులు జారీ




2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని డైరీ ప్రొడక్ట్స్ తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్, ఫుడ్ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. క్వాలిటీని గాలికొదిలేసి నాసిరకం ఉత్పత్తులను విక్రయిస్తున్న డైరీ సంస్థల తీరు ఈ తనిఖీల్లో వెలుగుచూసింది. మధుర, యశోద, బాలాజీ, జగన్నాథ్ డైరీ ప్రొడక్ట్స్ కేంద్రాలపై అధికారులు ముమ్మరంగా సోదాలు జరిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల మొత్తం 6 డైరీ యూనిట్లు, ఒక ట్రాన్స్‌పోర్ట్ కేంద్రంలో ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

# మతం మారితే బీసీ రిజర్వేషన్లు కట్!

- ఇస్లాంలోకి మారితే బీసీ రిజర్వేషన్లు వర్తించవు
- మద్రాస్ హైకోర్టు తీర్పుకు సమర్థన
- తమిళనాడు ప్రభుత్వ జీవో రద్దు
- ఏడు ముస్లిం శాఖల బీసీ గుర్తింపుపై వివాదం
- రిజర్వేషన్ల అర్హతపై స్పష్టత
- తమిళనాడు పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం
- బీసీ హోదాపై దేశవ్యాప్తంగా చర్చ

2 లో

# సింగరేణి ప్రైవేటీకరణపై క్లారిటీ

- సింగరేణి ప్రైవేటీకరణకు తావులేదు
- కార్మికులు ఆందోళన చెందొద్దు
- విపక్షాల ఆరోపణల్లో నిజం లేదు
- బీఆర్ఎస్‌పై శ్రీధర్‌బాబు ఫైర్
- సింగరేణిని జేబు సంస్థగా మార్చారని విమర్శ
- గత పాలనలో భారీగా బకాయిలు

2 లో



# దసరా దందా కోట్లు వసూలా!

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** ఈ దసరా పండుగ సందర్భంగా అదనంగా సుమారు రూ.1000 కోట్లుపైగా సంపాదించాలని ఎక్సైజ్ శాఖ టార్గెట్ పెట్టుకున్నట్టు తెలిసింది. అందుకు అనుగుణంగా లిక్కర్‌ను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే వైన్‌షాపుల ఓనర్లు రెగ్యూలర్ కొనుగోళ్లు కంటే అదనపు లిక్కర్ కోసం బేవరేజ్ కార్పొరేషన్‌ను ఆశ్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. గత ఏడాది దసరా అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా రావడంతో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగలేదు. ఈసారి మాత్రం అంచనాలకు తగ్గట్టుగా విక్రయాలు ఉంటాయని అబ్కారీ శాఖ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**15 రోజులుగా పెరిగిన సప్లయ్..**

రాష్ట్రంలో బోనాల పండుగ నుంచి లిక్కర్ సేల్స్ క్రమంగా పెరిగి, దసరా పండుగ నాటికి పీక్‌కు వెళ్తుంటాయి. ఈసారి కూడా జులై రెండోవారం (ఆషాఢ మాసం)నుంచి వైన్స్ విక్రయాలు పెరిగాయి. శ్రావణ మాసంలో కాస్త తగ్గినా మళ్లీ సెప్టెంబర్ మొదటి వారం నుంచి లిక్కర్ కొనుగోళ్లు పుంజుకున్నాయి.

మిగతాది 2 లో..

- దసరాకు వెయ్యి కోట్ల టార్గెట్
- వైన్‌షాపులకు పెరిగిన డిమాండ్
- అదనపు స్టాక్‌తో సిద్ధం
- బీర్ల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు
- పల్లెలకు పెరిగిన జనసందడి
- సెలవులతో ఊపందుకున్న అమ్మకాలు
- గతేడాది రూ.700 కోట్ల విక్రయాలు
- ఈసారి భారీ అమ్మకాల అంచనాలు
- అక్రమ విక్రయాలపై నిఘా అవసరం

# ఇండియా కూటమికి సుప్రీం షాక్!



2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. 'సర్' రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించింది. అయితే రాహుల్ గాంధీ పాదయాత్రగా వెళ్లి పిటిషన్ వేయడంపై కూడా చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రగా రావడంపై సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. "మేము వాస్తవ ప్రపంచానికి అతీతులం కాదు. మాకు అన్ని విషయాలూ తెలుసు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు." అని వ్యాఖ్యానించారు.

# సముద్రంలో ఐఫోన్లు..




2 లో

**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** ట్రేడింగ్‌కు స్వర్గధామమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో జరిగిన ఓ సముద్ర ప్రమాదం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. యూఏఈకి చెందిన ఓ కార్గో నౌక సముద్ర గనిని ఢీకొట్టి మునిగిపోవడంతో, అందులోని విలువైన వస్తువులు, ఐఫోన్లు సముద్రంలో తేలియాడాయి.

# సన్నబియ్యం ధరలకు రెక్కలు!

- 50 రోజుల్లో రూ.1,500కు పైగా పెరుగుదల
- ఎల్‌నినోతో మరింత పెరిగే అవకాశాలు
- నాణ్యమైన బియ్యానికి పెరిగిన డిమాండ్
- సన్నరకం వడ్ల సాగుకు రైతుల మొగ్గు
- మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లింపులు
- అక్రమ నిల్వలపై తనిఖీలు చేపట్టాలని డిమాండ్



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** సన్నబియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 50 రోజుల వ్యవధిలో బియ్యం ధరలు రూ.1,500లకు పైగా పెరిగాయి. ఎల్‌నినో కారణంగా ఈ ధరలు మరింతగా పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసిన తొలినాళ్లలో సన్నబియ్యం ధరలు దిగివచ్చాయి. ఆ తర్వాత మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. వర్షాలు తక్కువగా కురవడం, ఎల్‌నినో కారణంగా భిన్నమైన వాతావరణ పరిస్థితులను చూస్తున్నాం.

2 లో

# అభిజీత్ దిప్కేకు మేరీ మిల్బెన్ చురకలు!



2 లో

- అమెరికా నిధుల ఆరోపణలపై స్పందన
- చట్టాన్ని ఉల్లంఘించే శక్తులకు హెచ్చరిక
- దేశ ప్రగతికి కృషి చేయాలని హితవు
- మోదీ నాయకత్వాన్ని కొనియాడిన గాయని
- 150 కోట్ల మంది ప్రజలే మోదీకి బలమని వ్యాఖ్య
- 2029 ఎన్నికల్లోనూ మోదీకే మద్దతని ధీమా

## సముద్రంలో ఐఫోన్లు.. ఏరుకుంటున్న జనం!

మొదటి పేజీ తరువాయి

సింగపూర్ ఫ్లాగ్‌తో ప్రయాణిస్తున్న జీఎఫ్ఎస్ ప్రైడ్ అనే కంటైనర్ నౌక దుబాయ్ నుంచి వస్తువులను తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ నౌకలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటి, ఇతర ఖరీదైన వస్తువులతో కూడిన దాదాపు 2,500 కంటైనర్లు ఉన్నట్లుగా సమాచారం.

వైరల్ అవుతున్న వీడియోలు..

ప్రమాదం తర్వాత సముద్రంలో ఐఫోన్ బాక్సులు, పెర్ఫ్యూమ్ సీల్డ్ ప్యాకెట్స్ నీటిపై తేలియాడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. చిన్న పడవలపై వచ్చిన స్థానికులు నీటిలో తేలుతున్న ఆ ఖరీదైన వస్తువులను ఏరుకుంటున్న వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. అయితే, ఈ ప్రమాదంలో నౌకలోని 21 మంది సిబ్బందిని సకాలంలో సురక్షితంగా రక్షించినట్లుగా సింగపూర్ సముద్ర, ఓడరేవు అధికార వర్గాలు వెల్లడించాయి.

## నక్సలిజం గాయం..1,570 మంది బాధితులు!



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రథసారధిగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'సేవ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఇవాళ ఢిల్లీ నుంచి జూమ్ మీటింగ్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ బాధితులు, ఇతర దివ్యాంగులతో మాట్లాడిన ఆయన, నక్సలిజం మూలంగా వైకల్యం బారినపడిన గిరిజనులకు ఈ అభియాన్ కింద కృత్రిమ అవయవాలను అందిస్తుండటం పట్ల తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో పెరిగిన లబ్ధిదారులే నిదర్శనం..

ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. అక్టోబర్ 5 నుంచి 7 వరకు జగదల్‌పూర్ లో నిర్వహించిన స్పెషల్ క్యాంప్ ద్వారా ఏకంగా 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్ షా తెలిపారు. కేవలం బస్తర్ ప్రాంతంలోనే 1,570 మందికి పైగా బాధితులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సంఖ్యే బస్తర్ పడుతున్న వేదనను, బాధను స్పష్టంగా దేశానికి తెలియజేస్తోందని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర రూపం దాల్చిన నక్సలిజం వల్ల బస్తర్‌లోని నిరుపేద గిరిజనులు ఏ విధంగా దెబ్బతిన్నారో ఈ గణాంకాలే యావత్ ప్రపంచానికి చాటిచెబుతున్నాయని అమిత్ షా స్పష్టం చేశారు.

## ఇండియా కూటమికి సుప్రీం షాక్!

మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపు నిర్వహించడాన్ని సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ఆమోదయోగ్యం కాదని అన్నారు. న్యాయవ్యవస్థను బెదిరించి, ఒత్తిడి తెచ్చే ప్రయత్నంగా అభివర్ణించారు. న్యాయవాది వ్యాఖ్యలకు ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని.. ఇటువంటి ప్రయత్నాలు చాలా బలహీనమైనవని, వాటిని ఎవరూ పట్టించుకోరని సూర్యకాంత్ అన్నారు. తాము వాస్తవ ప్రపంచానికి దూరంగా కూర్చోలేదని.. తమకు అన్నీ తెలుసని చెప్పారు.

ఇక జంతర్ మంతర్ విషయమై సుప్రీంకోర్టు ఆదేశం మేరకు దానిని నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించలేదని ఎస్జీ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఒక కమిటీ ఆ సూచన చేసిందని తెలిపారు. నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు నోటీసు జారీ చేసింది. తాము ముందుగా ప్రభుత్వ స్పందనను వింటామని, సంతృప్తి చెందకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు పేర్కొంది.

## సింగరేణి ప్రైవేటీకరణపై క్లారిటీ



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** సింగరేణి సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించబోతున్నామంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని శాఖ మంత్రి శ్రీధర్ బాబు తేల్చి చెప్పారు. సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయబోమని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. గత పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం ఒక 'జేబు సంస్థ'గా మార్చుకుందని ఆరోపించారు. అంతేకాకుండా, సింగరేణికి భారీగా బకాయిలు పెట్టి సంస్థను ఆర్థికంగా దెబ్బతీసింది కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. అలాంటి బీఆర్ఎస్ నాయకులకు ఈరోజు సింగరేణి కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు లేదని వ్యాఖ్యానించారు.

**అనవసర ఆరోపణలను నమ్మవద్దు..**

సింగరేణి సంస్థను దెబ్బతీసి, దానికి చెడ్డపేరు తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని, వారు చేస్తే అనవసర ఆరోపణలు, విమర్శలను ప్రజలు, సింగరేణి కార్మికులు పట్టించుకోవాల్సిన అవసరం లేదని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను కూడా పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## మతం మారితే బీసీ రిజర్వేషన్లు కట్!



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** హిందూ సామాజికవర్గం నుంచి ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్లకు ఎట్టి పరిస్థితుల్లో అర్హులు కాబోరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్ లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టమైన తీర్పును వెలువరించింది. వాదనల సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి హిందూయేతర సామాజిక వ్యవస్థలోకి మారిన ఏ వ్యక్తి కూడా బీసీ రిజర్వేషన్ ప్రయోజనాలను క్లెయిమ్ చేయడానికి వీలుపడని అంశమని, అలాంటి వాళ్లందిరిక ఈ తీర్పులు వర్తిస్తుందని అని పేర్కొన్నది.

కాగా, వెనుకబడిన తరగతులకు చెందిన ముస్లింలలో 7 శాఖల వారికి బీసీ గుర్తింపునిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గతంలో మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది. వెనుకబడిన తరగతుల నుంచి ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తులను 'బీసీ ముస్లింలు'గా పరిగణించేలా తమిళనాడు ప్రభుత్వం తెచ్చిన జీవోను హైకోర్టు తప్పుపట్టింది. హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తాజాగా సర్వోన్నత న్యాయస్థానం కూడా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ తుది తీర్పును వెలువరించింది.

## అభిజీత్ దిప్కేకు మేరీ మిల్బెన్ చురకలు!



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** కాక్రోచ్ జనతా పార్టీ కీలక నేత అభిజీత్ దిప్కేను ఉద్దేశించి ప్రముఖ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలు, అమెరికా నిధుల ఆరోపణల నేపథ్యంలో 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా స్పందించిన ఆమె.. "నిజం ప్రతి ఒక్కరినీ విముక్తులను చేస్తుంది. చివరకు నిన్ను కూడా" అంటూ నేరుగా చురకలంటించారు. మీరు చేసే ప్రయత్నాల్లో విజయం సాధించకపోతే ఈ అమెరికన్ డోనర్లు వేడి జిలేబీని పడేసినట్లు మిమ్మల్ని పక్కన పెట్టేస్తారన్నది నగ్న సత్యమని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే అరాచక శక్తులు ఎప్పటికీ గెలవలేవని స్పష్టం చేసిన ఆమె.. అమెరికాలో పొందిన విద్య, ప్రతిభను దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాకుండా మంచి పనులకు ఉపయోగించాలని హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి కూర్చుని దేశ ప్రగతికి సానుకూల గళంగా మారాలని, సరైన నిర్ణయం తీసుకోవడంలోనే మీ ధైర్యం ఆధారపడి ఉందని దిప్కేకు సూచించారు.

ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి ఉన్న ప్రజాదరణను మేరీ మిల్బెన్ కొనియాడారు. ప్రధానమంత్రి మోడీకి అమెరికా వంటి దేశాల మద్దతు ఏమాత్రం అవసరం లేదని, ఆయన వెనుక 150 కోట్ల మంది భారతీయ పౌరుల అండదండలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. గత 25 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ, వరుసగా మూడు పర్యాయాలుగా 12 ఏళ్ల పాటు ప్రధానిగా దేశాన్ని నడిపిస్తున్న మోడీకి భారత ప్రజలే బలమని కొనియాడారు. అంతేకాకుండా, రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ దేశ ప్రజలు ముమ్మాటికీ నరేంద్ర మోడీకే మద్దతు పలికి గెలిపిస్తారని, ఇదే అసలైన నిజమని మిల్బెన్ స్పష్టం చేశారు. విదేశీ శక్తుల కనుసన్నల్లో సాగే ఉద్యమాలు ప్రజాస్వామ్యంలో నిలబడలేవని ఆమె తన ట్వీట్ ద్వారా తేల్చిచెప్పారు.

## బీఎస్-7పై కేంద్రం బిగ్ అప్‌డేట్!




**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా వాహన కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా వచ్చే కార్లు, ఎస్‌యూవీ ల కోసం మరింత కఠినమైన 'భారత్ స్టేజ్-7 (BS-VII) ఉద్గార ప్రమాణాలను తీసుకురావడానికి రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కొత్త నిబంధనలను 2029 ఏప్రిల్ 1 నుంచి 2035 ఏప్రిల్ 1 వరకు ఆరేళ్ల కాల వ్యవధిలో మూడు విడతలుగా అమలు చేయనున్నట్లుగా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అందులో మొదటి దశ ఏప్రిల్ 2029 నుంచి, రెండో దశ ఏప్రిల్ 2031 నుంచి, మూడో దశ ఏప్రిల్ 2035 నుంచి అమల్లోకి రానున్నాయి.

ప్రస్తుత వాహనదారులకు నో ప్రాబ్లం..

నైట్రోజన్ ఆక్సైడ్స్, హైడ్రోకార్బన్లు, పార్టిక్యులేట్ మేటర్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ బీఎస్-7 నిబంధనలను రూపొందించారు. అయితే, ఈ నిర్ణయం వల్ల ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న వాహనాలకు గానీ, బీఎస్-6 (BS-VI) ప్రమాణాలు కలిగిన వాహనాల జీవితకాలానికి గానీ ఎలాంటి ముప్పు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. కాగా, దేశంలో కాలుష్య నివారణను వేగవంతం చేసేందుకు భారత్ గతంలో 'బీఎస్-5'ను దాటవేసి నేరుగా 'బీఎస్-6' నిబంధనలను ఏప్రిల్ 2020 నుంచి అమలులో? కి తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

## సన్నబియ్యం ధరలకు రెక్కలు

మొదటి పేజీ తరువాయి

దానితో పాటు రేషన్ బియ్యాన్ని చాలా మంది తినడం లేదు. దీంతో నాణ్యమైన సన్నబియ్యానికి డిమాండ్ ఏర్పడింది.

నియంత్రణ పై దృష్టి పెడితే..

బియ్యం ధరల పై ప్రభుత్వంతో పాటు ధరల నియంత్రణ కమిటీలు కూడా కీలకంగా పనిచేయాల్సి ఉంటుంది. కేవలం 50 రోజుల్లోనే ధరలు ఈ విధంగా పెరిగిపోతే భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఊహించుకోవచ్చు. జిల్లాకేంద్రంలో కొందరు వ్యాపారులు సన్నబియ్యాన్ని రహస్యంగా నిల్వ చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అధికారులు అక్రమ నిల్వలను గుర్తించడానికి తనిఖీలు చేస్తే ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశాలు ఉంటాయి. కొనుగోలుదారులు వ్యాపారుల నుంచి బిల్లులను తీసుకుంటే మంచిది.

సన్నాలకు డిమాండ్..

ప్రభుత్వం సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అందజేస్తుంది. దీంతో చాలా మంది రైతులు సన్నాలను సాగు చేస్తున్నారు. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యాపారులు, మిల్లర్లు సన్నరకం ధాన్యాన్ని కల్లాల వద్దే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లిస్తున్నారు. దీంతో సన్నాలకు డిమాండ్ ఏర్పడింది. అధిక మొత్తం చెల్లించైనా సన్నాలను కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఈ ఏడాది సన్నరకం బియ్యం వ్యాపారులు, మిల్లర్ల వద్దకే వెళ్లే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ సమస్యలతో చాలా చోట్ల పంటలు ఎండిపోతున్నాయి. ఈ ప్రభావంతో దిగుబడులు తగ్గనున్నాయి. సామాన్యులకు అందుబాటు ధరల్లో బియ్యం లభించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పాల ఉత్పత్తుల్లో కల్తీ గుట్టురట్టు!

మొదటి పేజీ తరువాయి

ఈ సోదర్లలో అపరిశుభ్ర వాతావరణంలో డైరీ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తేలింది. ఎలాంటి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకుండానే గుట్టుచప్పుడు కాకుండా ఈ యూనిట్లు నడుస్తున్నట్లు గుర్తించారు. సరైన నిల్వ వసతులు లేకపోవడంతో పాటు, ఉష్ణోగ్రత నియంత్రణ పాటించకుండా డైరీ ప్రొడక్ట్సను నిల్వ చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్ వాహనాలను ఉపయోగించకుండా, ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి బస్సులు, డీసీఎంల ద్వారా హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్న 3.6 టన్నుల కల్తీ కోవాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన పలు డైరీ యూనిట్లను సీజ్ చేయడంతో పాటు, మరికొన్నింటికి షోకాజ్ మరియు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు.

## మహిళా శక్తితో స్వర్ణాంధ్ర లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి

మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబాలతో పాటు సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం ఆరు కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దడమే. మహిళలు కేవలం పొదుపు చేసే స్థాయి నుంచి ఆదాయం సంపాదించే వ్యాపారవేత్తలుగా ఎదగాలి' అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

'గతంలో పొదుపు సంఘాలుగా ప్రారంభమైన మహిళా సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా అభివృద్ధి చెందాయి. భవిష్యత్తులో ఇవే అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన డ్వాక్రా పొదుపు ఉద్యమం దేశం గర్వించే స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో పనిచేస్తున్నాయి. ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాము. ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాము. దీర్ఘకాలిక లక్ష్యంగా 10 లక్షల మంది మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పనిచేస్తుంది' అని సీఎం వివరించారు.

'ఏపీలో మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు స్వయం ఏపీ బ్రాండ్ తీసుకువచ్చాం. ఈ-కామర్స్, ఆన్ లైన్ షాపింగ్లో స్వయం ఏపీ పేరుతో ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. సంక్షేమంతో పాటు మహిళలకు భరోసా ఇచ్చేలా వారి సాధికారిత కోసం పనిచేస్తున్నాం. మహిళా శక్తిని బలోపేతం చేసేలా తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీశక్తితో ఉచిత బస్సు ప్రయాణంతో 100 కోట్ల ప్రయాణాలు మహిళలు చేశారు. సంక్షేమ పథకమైనా, అభివృద్ధి కార్యక్రమం అయినా మహిళల పేరుతోనే అమలు చేస్తున్నాం. ప్రతీ మహిళకు వెల్ఫేర్ టు వెల్త్ అందాలనేది మా నినాదం. సేవింగ్ మనీ స్థాయి నుంచి మేకింగ్ మనీ స్థాయికి మన ఎస్హెచ్జీ బృందాలు అభివృద్ధి చెందాయి. దేశంలోని ప్రతీ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ భారత్ దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చటంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది. మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ భద్రత కల్పించటంతో పాటు సాధికారిత దిశగా ఏపీ పనిచేస్తోంది. ఎస్ హెచ్ జీల సాయంతో స్వర్ణాంధ్ర 2047 కలను సాకారం చేసేలా ముందుకు వెళ్తున్నాం. ప్రతీ ఎస్ హెచ్ జీ ఓ ఆర్థిక శక్తిగా, ప్రతీ మహిళా పారిశ్రామికవేత్తగా, ప్రతీ గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలన్నదే మా ఆలోచన' అని సీఎం చెప్పుకొచ్చారు.

## దసరా దందా.. కోట్లు వసూలా!

మొదటి పేజీ తరువాయి



దసరా పండగ నాటికి మరింత ఊపందుకుంటుదని ఎక్సైజ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే లిక్కర్ షాపు ఓనర్లు ప్రతి నెలలో కొనుగోలు చేసే మొత్తం కంటే అదనపు లిక్కర్‌ను బేవరేజ్ కార్పొరేషన్ నుంచి సేకరిస్తున్నట్టు చెప్తున్నారు. అందుకోసం అదనపు రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దసరా సీజన్‌లో మందుతోపాటు బీర్ల సేల్స్ కూడా రెండింతలు పెరగటం సహజం. దీనితో నెల రోజుల క్రితం నుంచి బీర్ల ఉత్పత్తిని డబుల్ చేసినట్టు తెలిసింది. గత ఏడాది దసరా పండుగ, గాంధీ జయంతి (అక్టోబరు2) ఒకేరోజు రావడంతో ఆశించిన స్థాయిలో మద్యం విక్రయాలు జరగలేదు. అయినా సుమారు రూ.700 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఈసారి మాత్రం రూ. 1000 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు ఉంటాయని ఎక్సైజ్ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఆదివారం నుంచి పండుగే..

స్కూళ్లకు సెలవులు ఇవ్వడంతో మెజార్టీ మంది సొంత ఊర్లకు వెళ్లారు. ఈ ఆదివారం నుంచే గ్రామాల్లో మద్యం విక్రయాల్లో పెరుగుదల ఉందని, దసరా పండుగ నాటికి డబుల్, ట్రిబుల్ స్థాయిలో అమ్మకాలు ఉంటాయని లిక్కర్ షాపుల ఓనర్లు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 2600 పైగా వైన్ షాపులు ఉన్నాయి. వాటికి అనుబంధంగా పర్మిట్ రూమ్స్ ఉన్నాయి. వీటికి తోడు ప్రతి గ్రామంలో రెండు మూడు బెల్ట్ షాపులు ఉన్నాయి. దీనితో మద్యం విక్రయించే షాపులు (వైన్ షాపులు, బార్లు, బెల్ట్ షాపులు) కలుపుకుని సుమారు పదివేల వరకు ఉంటాయని అనధికారికవర్గాల అంచనా. 'మంగళవారం దసరా పండుగ ఉంది. పండుగకు రెండు రోజుల ముందు నుంచే గ్రామాల్లో పండుగ వాతావరణం మొదలవుతోంది. పండుగ తెల్లారి కూడా విక్రయాలు ఎక్కువగా ఉంటాయి' అని వైన్‌షాపు ఓనర్ల అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి.

## ఢిల్లీ నిరసనలపై సుప్రీం కొరడా!



**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** దేశ రాజధాని ఢిల్లీలో అక్టోబర్ 10న జరిగిన భారీ నిరసనలు, ఆందోళనకారుల నిర్బంధంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతియుత నిరసనకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులపై పోలీసుల దాడులు, అక్రమ నిర్బంధాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. నిరసనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ దృశ్యాలను తక్షణమే భద్రపరిచి న్యాయస్థానానికి సమర్పించాలని అన్ని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. అలాగే జంతర్ మంతర్‌ను నిరసన వేదిక జాబితా నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆందోళనకారుల ప్రాథమిక హక్కుల వాదనపై ధర్మాసనం స్పందిస్తూ.. "ప్రభుత్వానికి తమ స్వరం వినిపించాలనే ఆలోచనను నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కూడా సాకారం చేసుకోవచ్చు" అని జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం వ్యాఖ్యానించింది.

మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, 'ఇండియా' కూటమికి చెందిన 13 మంది అగ్రనేతలు ఈసీఐ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఓట్ల తొలగింపును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలకు న్యాయస్థానం నోటీసులు పంపింది. అయితే, ఈ పిటిషన్ వేసిన 13 మంది ఇండియా కూటమి నేతల్లో ఒకరి ప్రవర్తనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సదరు పిటిషనర్ ప్రవర్తనపై వివరణ కోరతామని స్పష్టం చేస్తూనే, ఓటర్ల జాబితా అక్రమాలపై ఈసీఐ తన స్పందనను తెలియజేయాలని ఆదేశించింది.

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ఫైనల్ స్టేజ్!




**న్యూస్ డెస్క్, 15 అక్టోబర్ (తెలుగు గళం):** భారత్-అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మొదటి విడత డ్రాఫ్టింగ్ ఆఖరి దశకు చేరుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చట్టపరమైన ముసాయిదా ప్రక్రియ వేగంగా జరుగుతోందని తెలిపారు. అయితే బంగ్లాదేశ్, వియత్నాం, ఇండోనేషియా వంటి పోటీ దేశాల కంటే అమెరికా మార్కెట్‌లో భారతీయ ఎగుమతిదారులకు మెరుగైన లేదా సమానమైన పన్ను ప్రయోజనం లభిస్తేనే ఈ ఒప్పందంపై ముందుకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

గత ఏడాది రెండు దేశాల మధ్య చర్చలు విఫలమైన తర్వాత భారత వస్తువులపై విధించిన 50 శాతం శిక్షాత్మక సుంకాలను, ఈ ఏడాది ఫిబ్రవరిలో కుదిరిన ప్రాథమిక ఒప్పందం ద్వారా 18 శాతానికి తగ్గించారు. భారత్ ఈ ఒప్పందం ద్వారా మెరుగైన మార్కెట్ ప్రాప్యతతో పాటు సుంకాల స్థిరత్వాన్ని కోరుతోందని కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ పేర్కొన్నారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు మధ్యకాలంలో అమెరికాకు భారత వస్తువుల ఎగుమతులు 42.79 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

అయితే రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేస్తుండటంతో, భారతీయ వస్తువులపై 100 శాతం వరకు పన్నులు విధించేలా అమెరికా ఇటీవల తెచ్చిన కొత్త చట్టం ఈ చర్చలకు కొంత ఆటంకంగా మారింది. ఇరు దేశాల మధ్య కొంత ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో.. దౌత్య సంబంధాలను బలపరిచేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్ 17 నుంచి 22 వరకు భారత్, ఉజ్బెకిస్తాన్‌లలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన భారత ప్రభుత్వ ప్రతినిధులు, వ్యాపార దిగ్గజాలతో సమావేశమై ఇంధన సహకారం, వాణిజ్య పెట్టుబడులు, ఆర్థిక సంబంధాలపై విస్తృతంగా చర్చించనున్నారు.

# అప్పుడు మూడు ముక్కలు.. ఇప్పుడు రెండు ముక్కలే!

- ఏటూరునాగారం ఎక్సైజ్ వేలంలో నిబంధనలపై గందరగోళం..
- అధికారుల తీరుపై అనుమానాలు
- 35 వాహనాలు.. 32 చాయిస్ నంబర్లు!
- స్క్రాప్ వేలంలో అసలేం జరుగుతోంది? ఉన్నతాధికారులు విచారణ జరిపేనా?
- వేలంలో ఒక మాట.. అప్పగింతలో మరో మాట!
- ఏటూరునాగారం ఎక్సైజ్ శాఖ వ్యవహారంపై వినియోగదారుల ఆగ్రహం
- స్క్రాప్ వేలంలో పారదర్శకత ఏదీ?
- మూడు ముక్కల నిబంధన ఎక్కడికి పోయింది? 32 వాహనాల చాయిస్ నంబర్లపై ప్రశ్నలు



**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు అక్టోబర్ 15:**

ఏటూరునాగారం ఎక్సైజ్ శాఖ నిర్వహించిన ద్విచక్ర వాహనాల స్క్రాప్ వేలం వ్యవహారం ఇప్పుడు వివాదానికి దారితీస్తోంది. వేలం నిర్వహించే సమయంలో ఒక విధమైన నిబంధనలు చెబుతూ, వాహనాలను అప్పగించే సమయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు వేలంలో ఉన్న 35 ద్విచక్ర వాహనాల్లో 32 వాహనాలకు చాయిస్ నంబర్లు ఉన్నట్లు వెల్లడవడం పలు సందేహాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

**-వేలంలో మూడు ముక్కల నిబంధన.. తీరా రెండు ముక్కలతోనే సరి!-**

గత సెప్టెంబర్ 24న నిర్వహించిన వేలంలో ద్విచక్ర వాహనాలను మూడు ముక్కలుగా చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పినట్లు పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. ఈ నిబంధన కారణంగానే కొందరు వేలంలో పాల్గొనకుండా వెనుదిరిగినట్లు చెబుతున్నారు. అయితే అక్టోబర్ 15న వాహనాలను రెండు ముక్కలుగానే స్క్రాప్ చేసి అప్పగిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వేలం సమయంలోనే రెండు ముక్కలుగా స్క్రాప్ చేసి అప్పగించే విధానం ఉంటుందని స్పష్టంగా తెలిపి ఉంటే తాము కూడా వేలంలో పాల్గొనేవారమని కొందరు వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు. వేలానికి ముందు ప్రకటించిన షరతులు, వాహనాలను అప్పగించే సమయంలో అనుసరిస్తున్న విధానంలో తేడా ఎందుకు వచ్చిందన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. నిబంధనలు అందరికీ ఒకే విధంగా వర్తించాయా? వేలంలో పాల్గొన్న వారందరికీ ఒకే సమాచారం ఇచ్చారా? అనే అంశాలపై అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**-35 వాహనాల్లో 32 చాయిస్ నంబర్లు.. ఎలా సాధ్యమైంది?-**



వేలంలో ఉన్న మొత్తం 35 ద్విచక్ర వాహనాల్లో 32 వాహనాలకు చాయిస్ నంబర్లు ఉన్నట్లు వెల్లడవడం మరో వివాదానికి కారణమైంది. దీనిపై ప్రశ్నించినప్పుడు, వాహనాలను స్వాధీనం చేసుకున్నప్పుడే వాటికి చాయిస్ నంబర్లు లేవని, ప్రస్తుతం తాము ఏమీ చేయలేమని అధికారులు చెప్పినట్లు సమాచారం. అయితే వాహనాలను స్వాధీనం చేసుకున్న సమయంలో వాటి గుర్తింపు వివరాలను ఎలా నమోదు చేశారు? కేసుల రికార్డుల్లో ఛాసిస్, ఇంజిన్ నంబర్ల వివరాలు ఉన్నాయా? వేలానికి ముందు వాహనాలను తనిఖీ చేశారా? వాటి పరిస్థితిని నిర్ధారించే నివేదికలు ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశాలపై అనుమానాలకు తావులేకుండా సంబంధిత రికార్డులను పరిశీలించి అధికారులు వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**-గతంలోనూ ఇదే విధానమా?-**

గతంలో స్క్రాప్ పేరుతో వేలం వేసిన కొన్ని ద్విచక్ర వాహనాలు తిరిగి రోడ్లపై వినియోగంలోకి వస్తున్నాయంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. స్క్రాప్ చేసిన వాహనాలు తిరిగి వినియోగంలోకి రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? వాహనాలను ధ్వంసం చేసినట్లు ఆధారాలు నమోదు చేస్తున్నారా? వేలం అనంతరం వాటి అప్పగింత, స్క్రాప్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర పరిశీలన జరగాలని స్థానికులు కోరుతున్నారు.

**-సీఐ సమాధానంపై అసంతృప్తి.. ఉన్నతాధికారులు స్పందించేనా?-**

ఈ వ్యవహారంపై ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా, గతంలో ఏ విధంగా చేశామో ఇప్పుడూ అలాగే చేస్తున్నామని చెప్పినట్లు తెలిసింది. అయితే ఈ సమాధానం తమ సందేహాలను నివృత్తి చేయలేదని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనుసరించిన విధానం ఏమిటి? ప్రస్తుత వేలానికి వర్తించే నిబంధనలు ఏమిటి? వేలం నోటీసులో పేర్కొన్న షరతులు, వాహనాల అప్పగింత విధానం మధ్య వ్యత్యాసం ఎందుకు కనిపిస్తోందన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సెప్టెంబర్ 24న నిర్వహించిన వేలం నోటీసు, షరతులు, వేలం జాబితా, వాహనాల స్వాధీన రికార్డులు, ఛాసిస్, ఇంజిన్ నంబర్ల వివరాలు, స్క్రాప్ చేసిన తీరుకు సంబంధించిన ఆధారాలను పరిశీలించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారిక రికార్డులతో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తంగా, ఏటూరునాగారం ఎక్సైజ్ శాఖ స్క్రాప్ వేలం వ్యవహారంలో పారదర్శకతపై నెలకొన్న సందేహాలకు సమాధానాలు రావాల్సి ఉంది. వేలం నిర్వహణ నుంచి వాహనాల అప్పగింత వరకు జరిగిన ప్రక్రియపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తారా? లేక ఈ వ్యవహారం ప్రశ్నలకే పరిమితం అవుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఎల్‌నినో కరువును ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలి

- ప్రతి గిరిజన కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించాలి
- ప్రతి జాబ్‌కార్డుకు నెలకు రూ.7,500 వేతనం అందేలా లక్ష్యం: మంత్రి సీతక్క





**తెలుగు గళం, ములుగు, అక్టోబర్ 15**

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ముఖ్యంగా ఏజెన్సీ, ఆదివాసీ గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు.బేగంపేటలో గురువారం విబి-జి రాంజీ ద్వారా ఎల్‌నినో కరువు నివారణ చర్యలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్‌కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం అందేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించి, గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా కల్పించాలన్నారు.ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు పని కల్పించడంతో పాటు గ్రామాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. చెరువుల పూడికతీత, చెక్‌డ్యాంల నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి పనులు చేపట్టి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించాలని పేర్కొన్నారు. కరువు పరిస్థితుల్లో పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీతక్క సూచించారు.తాగునీరు, విద్యుత్, రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఏలు, పేదరిక నిర్మూలన సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో నివసించే ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.చిట్టచివరి గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాబోయే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యాచరణ అమలు చేయాలని ఆమె సూచించారు.

# పేదల పక్షపాతి చలమాల సూర్యనారాయణ

- సీపీఎం బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిది
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు




**సత్తుపల్లి,ఆర్ సి,అక్టోబర్15 (తెలుగుగళం) న్యూస్:** తాను నమ్మిన సిద్ధాంతం కోసం, పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి చలమాల సూర్యనారాయణ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు అన్నారు. చలమాల సూర్యనారాయణ 43వ వర్ధంతిని గురువారం వి.ఎం.బంజర్‌లోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు నల్లమల అరుణ్ ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కమ్యూనిస్టులపై కాంగ్రెస్ పెత్తందారులు అణచివేత ధోరణి అవలంబిస్తున్న రోజుల్లో, కాంగ్రెస్ విధానాలను విభేదించి సీపీఎంలో చేరిన చలమాల సూర్యనారాయణ అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పెనుబల్లి మండలంలో బూర్జువా శక్తులను ఎదుర్కొంటూ ముందుకు సాగారని తెలిపారు. ఆయన పోరాట స్ఫూర్తికి ఆకర్షితులైన అనేకమంది యువకులు ఆయన వెంట నడిచారని పేర్కొన్నారు.ఎన్ని నిర్బంధాలు ఎదురైనా చలమాల సూర్యనారాయణ చివరి వరకు పార్టీకి అంకితభావంతో పనిచేశారని విఠల్‌రావు అన్నారు. పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సూర్యనారాయణ ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు నేటి పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాండ్ర రాజేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, మిట్టపల్లి నాగమణి, కర్రీ రజిని, చలమాల నరసింహారావు, హమాలీ యూనియన్ అధ్యక్షుడు మిద్దె స్వామి, కాంగ్రెస్ నాయకులు వంగ గిరిజపతి, మల్లెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో హోరాహోరీగా వీసీఎల్ సీజన్--3 క్రికెట్ పోటీలు!

'సే నో డ్రగ్స్' నినాదంతో యువతకు అవగాహన.. ఐదో రోజు పోటీల్లో సత్తాచాటిన జట్లు



**తెలుగు గళం వెంకటాపురం (నూగూర్), అక్టోబర్ 15**

దసరా మహోత్సవాల సందర్భంగా ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కాఫెడ్ మైదానంలో వెంకటాపురం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటాపురం ప్రీమియర్ లీగ్ (వీపీఎల్) సీజన్--3 క్రికెట్ టోర్నమెంట్ ఐదో రోజు పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో 'సే నో డ్రగ్స్' నినాదంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.ఐదో రోజు జరిగిన మ్యాచ్‌ల్లో క్రికెట్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో హేమాచల వారియర్స్ జట్టు వైకింగ్ వారియర్స్‌పై విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో సాయి మెస్ లెవెన్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఎస్ఎస్ వారియర్స్‌పై 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.మూడో మ్యాచ్‌లో దుర్గమ్మ ఏ లెవెన్ జట్టు 10 పరుగుల తేడాతో హేమాచల వారియర్స్‌ను ఓడించి విజయాన్ని సొంతం చేసుకుంది.పోటీల్లో ప్రతిభ కనబరిచి జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించిన వట్టం నరేందర్, ఉదయ్, నటరాజ్‌లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు లభించాయి. ముఖ్య అతిథి డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ విజేతలకు అవార్డులను అందజేసి అభినందించారు.క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడంతో పాటు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.టోర్నమెంట్‌లో జట్లు ఉత్సాహంగా పాల్గొంటుండటంతో కాఫెడ్ మైదానంలో క్రికెట్ సందడి నెలకొంది.

## కృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించిన సండ్ర"



**సత్తుపల్లి/వేంసూరు, అక్టోబర్ 15(తెలుగుగళం)న్యూస్:** వేంసూర్ మండలానికి చెందిన కొత్తూరు గ్రామంలో ఇటీవల మరణించిన జాలిపర్తి కృష్ణయ్య వారి కుటుంబాన్ని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు కృష్ణయ్య కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు అలాగే కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో కొత్తూరు టిఆర్ఎస్ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు




**హన్మకొండ, అక్టోబర్ 15 (తెలుగు గళం న్యూస్)** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా హన్మకొండలోని మడికొండ సత్యసాయి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ నాయకులు, ఇతర ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ సమావేశానికి పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.

## రైతుల భూములకు పట్టాలు ఇప్పించాలి

- భూముల పత్రాల కోసం ఐటీడీఏ అధికారులకు వినతి
- రైతుల తరపున వినతిపత్రం అందజేసిన సర్పంచ్ ఈసం జనార్ధన్



**తెలుగు గళం ఏటూరునాగారం, అక్టోబర్ 15:**

ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఎస్‌డీసీ, డీడీ అధికారులను ముళ్ళకట్ట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఈసం జనార్ధన్ గురువారం రోజున కలిసి వినతిపత్రం అందజేశారు. ముళ్ళకట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్ అగ్రహారం గ్రామ రైతులకు గతంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కొనుగోలు పథకం కింద భూములు కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయితే, సదరు భూములకు ఇప్పటివరకు పట్టాలు జారీ కాలేదని పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన భూముల ఆధారాలు, కొనుగోలు పత్రాలు, ఇతర దస్త్రాలను అందజేసి, పట్టాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రైతుల తరపున సర్పంచ్ ఈసం జనార్ధన్ ఈ వినతిపత్రాన్ని సమర్పించారు.

## వాజేడు పీహెచ్‌సీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

-ఆటపాటలతో సందడి చేసిన ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ: వైద్యాధికారి డాక్టర్ యోసీత



**తెలుగు గళం వాజేడు, అక్టోబర్ 14:**

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ యోసీత ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి పండుగలు మహిళల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వేడుకల్లో ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న ర్యాలీ చిన్నయ్య చౌదరి దంపతులు



**తెలుగు గళం మంగపేట, అక్టోబర్ 15:** ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం ప్రసిద్ధ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదవ రోజు అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ర్యాలీ చిన్నయ్య చౌదరి, భవాని దంపతులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని బంగారు మైసమ్మ తల్లిని, దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**తెలుగు గళం న్యూస్ వరంగల్/అక్టోబర్ 15**

వరంగల్: జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన బహుళ ప్రత్యేక వైద్య ఆసుపత్రి నిర్మాణ పనులను వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కతో కలిసి పరిశీలించారు.ఆసుపత్రి పనుల పురోగతిని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపత్రి పూర్తయితే వరంగల్ తో పాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టి, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, శాసనమండలి సభ్యులు సారయ్య, కూడా చైర్మన్ గుండు సుధారాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, హన్మకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, చైర్మన్లు,జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర ప్రమాదం.

**- డ్రైవర్ మృతి**



**సత్తుపల్లి/కల్లూరు, అక్టోబర్15(తెలుగు గళం) న్యూస్:**

ఖమ్మంజిల్లా కల్లూరు మండలం చంద్రుపట్ల సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై ఆగివున్న లారీని వెనుక నుంచి ఐచర్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐచర్ వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం.గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వరుసగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హైవేపై ఆగివున్న భారీ వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ప్రయాణికులు, వాహనదారుల భద్రత దృష్ట్యా హైవేపై ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వెంకటాపురం, వాజేడు కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా హుస్సేన్, విక్రాంత్ ఏకగ్రీవ ఎన్నిక

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి: పైడాకుల అశోక్**
**సీతక్క సూచనల మేరకు మండల అధ్యక్షుల నియామకం..**
**నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు**




**తెలుగు గళం వెంకటాపురం, అక్టోబర్ 15:**

రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచనల మేరకు వెంకటాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సయ్యద్ హుస్సేన్‌ను, వాజేడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాకర్లపూడి విక్రాంత్‌ను ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపిన పైడాకుల అశోక్, సీనియర్, జూనియర్ నాయకులనే తేడా లేకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## భూముల రీ-సర్వేను వేగవంతం చేయాలి:కలెక్టర్ రాహుల్ శర్మ



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి**

జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి,నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.గురువారం కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మాగాణి,మెట్ట భూముల గుర్తింపు,గ్రామ,చెరువుల సరిహద్దుల నమోదు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పనులను వేగవంతం చేసేందుకు ప్రతి మండలంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని,రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని స్పష్టం చేశారు.సిబ్బంది ఎదుర్కొంటున్న ఐడీ,లాగిన్ వంటి సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.క్షేత్ర పర్యటనలో భాగంగా కలెక్టర్ స్థానిక రైతు కల్పనతో మాట్లాడి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.రీ-సర్వే అత్యంత పారదర్శకంగా,లోపాలు లేని విధంగా జరగాలని,ప్రక్రియను ఆర్డీవో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి,తహసీల్దార్ హేమ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లీ కష్టాలు.. గోదావరే శాపమైందా..?

**ఇసుక మాఫియా దెబ్బకు ఛిద్రమవుతున్న రోడ్లు.. బలవుతున్న ప్రాణాలు!**
**అధిక లోడు.. మితిమీరిన వేగం.. ఇసుక లారీలకు అడ్డుకట్ట ఏది?**
**ఇసుక తవ్వకాలతో అడుగంటుతున్న భూగర్భ జలాలు.. అన్నదాతలకు కన్నీళ్లే!**
**ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం!**



**తెలుగు గళం ములుగు జిల్లా, అక్టోబర్ 15:**

గోదావరి నది తీర ప్రాంత ప్రజలకు వరంగా ఉండాల్సింది ఇసుక తరలింపుతో శాపంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో నిత్యం వందలాది ఇసుక లారీల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని, అధిక లోడు, మితిమీరిన వేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. విచ్చలవిడి ఇసుక తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, రైతులకు సాగునీరు, గ్రామీణ ప్రజలకు తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పస్రా--తాడ్వాయి మధ్య ఇసుక లారీ ఢీకొన్న ఘటనలో ఓ జవాన్ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇన్నాళ్ళుగా సామాన్యుల ప్రాణాలు పోతున్నా స్పందించని అధికారులు, పోలీసులు ఇప్పుడు మాత్రమే తనిఖీలు చేపట్టడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని, ఓవర్‌లోడింగ్, అతివేగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని గోదావరి తీర ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వెంకటాపురం తుడుందెబ్బలో మరో కమిటీ ఏర్పాటుపై అభ్యంతరం!

- ప్రస్తుత కమిటీ ఉండగానే కొత్త కమిటీ ఎందుకు? రాష్ట్ర నాయకత్వం స్పష్టత ఇవ్వాలి,
- తుడుందెబ్బలో కమిటీల వివాదం..
- బైలాకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి!
- తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తుర్స చంటి దొర డిమాండ్





**తెలుగు గళం నూగూర్ వెంకటాపురం, అక్టోబర్ 15:**

వెంకటాపురం మండలంలో ఇప్పటికే కొనసాగుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల కమిటీ ఉండగానే మరో నూతన కమిటీ ఏర్పాటు చేయడంపై ప్రస్తుత కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంఘం బైలాకు అనుగుణంగా ఈ వివాదంపై రాష్ట్ర నాయకత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. వెంకటాపురం మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద తుడుందెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ సోడి శ్రీను అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో మండల అధ్యక్షుడు తుర్స చంటి దొర మాట్లాడుతూ, -2025 ఆగస్టు 4న ఏర్పాటు చేసిన ప్రస్తుత కమిటీకి రెండేళ్ల కాలపరిమితి ఉండగా, ముందస్తు సమాచారం లేకుండా మరో కమిటీని ఏర్పాటు చేయడం సమంజసం కాదని-అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ జోక్యం చేసుకొని, ప్రస్తుత కమిటీ కొనసాగింపు, నూతన కమిటీ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని, అంతర్గత విభేదాలు సంఘం ప్రతిష్ఠకు భంగం కలిగించకుండా రాష్ట్ర నాయకత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు పాయం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మిచ్చ సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**• సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య"**



**సత్తుపల్లి,ఆర్ సి,అక్టోబర్ 15, (తెలుగుగళం) న్యూస్:** రాష్ట్రంలో విద్యుత్ సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రే అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, తన బాధ్యతను విస్మరించి అధికారులపై నెపం నెట్టడం బాధాకరమని సండ్ర అన్నారు. అధికారులపై పట్టు సాధించలేకపోతున్న ముఖ్యమంత్రి, "మీరు నా మాట వినట్లేదు" అంటూ వ్యాఖ్యానించడం పాలనలోని వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. గత నెల రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యకలాపాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.

**కేసీఆర్ హయాంలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ కష్టాలు తప్పవన్న రీతిలో వ్యాఖ్యానించారని సండ్ర గుర్తుచేశారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ఒకప్పుడు విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణను విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 19,450 మెగావాట్లకు పెంచినట్లు సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు సరఫరా, పంపిణీ వ్యవస్థలను కూడా విస్తృతంగా అభివృద్ధి చేశామని వివరించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం... 400 కేవీ సబ్‌స్టేషన్ల సంఖ్యను 6 నుంచి 30కి, 220 కేవీ సబ్‌స్టేషన్లను 51 నుంచి 103 కి, 132 కేవీ సబ్‌స్టేషన్లను 176 నుంచి 251కి పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా ఈహెచ్వి సబ్‌స్టేషన్ల సంఖ్యను 233 నుంచి 384కి పెంచడంతో పాటు, ఈహేచ్టి లైన్ల సర్క్యూట్ పొడవును 16,378 కిలోమీటర్ల నుంచి 28,131 కిలోమీటర్లకు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 14,973 ఎంవిఏ నుంచి 38,941 ఎంవిఏ కు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేశామని వివరించారు.

**కొత్త విద్యుత్ కేంద్రాలతో ఉత్పత్తి సామర్థ్యం పెంపు...**

కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 42 నెలల్లో పూర్తి చేశామని, భద్రాద్రిలో 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని సండ్ర తెలిపారు. యాదాద్రిలో 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రం, భూపాలపల్లిలో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ రంగంలో 6,480 మెగావాట్లు, సౌర విద్యుత్ రంగంలో 3,600 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని సమకూర్చినట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన విద్యుత్ మౌలిక సదుపాయాలు, పనిచేసిన అధికార యంత్రాంగమే ప్రస్తుతం కూడా ఉన్నాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయో సమాధానం చెప్పాలని సండ్ర ప్రశ్నించారు. విద్యుత్ కొరతకు ఎల్‌నినో ప్రభావాన్ని కారణంగా చూపుతూ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులను బాధ్యులుగా చూపడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**రైతులకు న్యాయం చేయాలి పంట నష్టానికి పరిహారం అందించాలని**

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించి రైతుల పంటలను కాపాడాలని కోరారు. విద్యుత్ సమస్యలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, అవసరమైన ప్రాంతాల్లో కరువు మండలాలను ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ రంగంలో గతంలో సాధించిన అభివృద్ధిని కొనసాగిస్తూ, ప్రస్తుత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు, అధికారులపై నిందలు వేయడం పక్కనపెట్టి, ప్రజలకు మరియు రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు. ఈ సమావేశంలో: మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమరాజు, అమరవరపు కృష్ణారావు, మోదుగు పుల్లారావు, బెల్లంకొండ రాము, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, నడ్డి ఆనందరావు, మేకల నరసింహారావు, జొన్నలగడ్డ విజయ్, మోరంపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో పరిస్థితులను రాజకీయం చేయడమా హవ్వా హవ్వా:

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్"**



**సత్తుపల్లి, ఆర్ సి,అక్టోబర్ 15, (తెలుగుగళం)న్యూస్:**

ఎల్ నినో పరిస్థితులను కూడా రాజకీయం చేయడం దురదృష్టకరం అని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు.ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో వర్షపాతం తగ్గిన పరిస్థితులను కూడా బిఆర్ఎస్ రాజకీయ విమర్శలకు వాడుకోవడం సరికాదు అన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడే సమస్యలను ప్రభుత్వ వైఫల్యాలుగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసం అన్నారు. 1951 నుంచి 2026 వరకు దేశంలో ఇలాంటి పరిస్థితులు 16 సార్లు ఎదురైనట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు ప్రభుత్వాల చేతుల్లో ఉండవు. అయితే, ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవడం, వారికి భరోసా కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ఈ కష్టకాలంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా రైతన్నలకు ధైర్యం చెప్పాల్సింది పోయి, ప్రతి సమస్యకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. కేసీఆర్ హయాంలో కరోనా మహమ్మారి వచ్చినప్పుడు, ఆ విపత్కర పరిస్థితులకు ప్రభుత్వానిదే బాధ్యత అని విమర్శించిందా ప్రకృతి, వాతావరణ పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం లేదా అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష పార్టీ బాధ్యతే. అదే సమయంలో, ప్రకృతి పరిస్థితులను కూడా రాజకీయ విమర్శలకు వాడుకోవడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు అన్నారు.రాజకీయాలు చేయాల్సిన అంశాలపై రాజకీయాలు చేయండి. కానీ ప్రతి విషయాన్నీ రాజకీయం చేయకండి అన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన సమయంలో విమర్శలకే పరిమితమైతే ప్రజల్లో చులకనయ్యే ప్రమాదం ఉంది అన్నారు. రైతులకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు ధైర్యం, భరోసా, పరిష్కారాలు అని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.